# అగ్రనేత

తెలుగు దిన పత్రిక


TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 09 సంచిక :198 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: మంగళవారం 08-10-2024 పేజీలు:4 వెల: 2.00


## మహాచండీ అవతారంలో దుర్గమ్మ

విజయవాడ,అక్టోబర్7: ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు మహాచండీ దేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనమిచ్చారు. దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ,శిష్ట రక్షణకు మహాలక్ష్మీ,మహాకాళీ, మహా సరస్వతి త్రిశక్తి స్వరూపిణిగా శ్రీ మహాచండీ అమ్మవారు ఉద్భవించారు.శ్రీ చండీ అమ్మవారిలో అనేక మంది దేవతలు కొలువై ఉన్నారు. శ్రీ మహాచండీ అనుగ్రహంతో విద్య, కీర్తి, సంపదలు లభించి శత్రువులు మిత్రులుగా మారడంతో పాటు ఏ కోరికలతో ప్రార్థిస్తామో అవన్నీ సత్వరమే లభిస్తాయనేది భక్తజనుల నమ్మకం.ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు.ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

## రుణమాఫీపై ప్రధాని మరోమారు విమర్శలు




హైదరాబాద్,అక్టోబర్7: తెలంగాణలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన రుణమాఫీపై ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలను తిప్పికొడుతూ..సిఎం రేవంత్ రెడ్డి వివరణాత్మక లేఖను రాసారు. 9 నెలలుగా తెలంగాణలో అమలు చేసిన పథకాలు, ప్రజలకు చేసిన మేలును వివరిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. గత కొన్ని రోజులుగా తెలంగాణతోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను టార్గెట్ చేసుకొని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతున్నారు. అధికారంలోకి రావడానికి అనేక ఉచిత హామీలు ప్రకటిస్తున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మర్చిపోతుందని విమర్శలు చేస్తున్నారు. జమ్ముకశ్మీర్, హర్యానా ఎన్నికల ప్రచారంలో విమర్శలు చేస్తూ వచ్చారు. తాజాగా మహారాష్ట్రలో కూడా ఇదే విధమైన విమర్శలు చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉండటంతో ప్రధానమంత్రి చేస్తున్న విమర్శలపై సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా రియాక్ట్ అయ్యారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు చేసిన పనులను వివరిస్తూ లేఖ రాశారు. కాంగ్రెస్ గ్యారెంటీలు అంటే గోల్డెన్ గ్యారెంటీలుగా ప్రజలు విశ్వసిస్తున్నారని ప్రధానికి వివరించారు. ఆ వివరాలను ఎక్స్ సోషల్ మీడియా అకౌంట్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్టు చేశారు. ల్గ÷తులను కాంగ్రెస్ పార్టీ హామీల పేరుతో నిలువునా మోసం చేసిందన్న ప్రధానమంత్రి విమర్శలను రేవంత్ రెడ్డి తిప్పికొట్టారు. ఇచ్చిన మాట ప్రకారం 22,22,067 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్టు వివరించారు. రైతుల ఖాతాల్లో 17,869.22 కోట్లు రూపాయలు వేసినట్టు గుర్తు చేశారు. 2 లక్షల రూపాయల కంటే ఎక్కువ రుణం ఉన్న వారిని కూడా పరిగణలోకి తీసుకుంటున్నట్టు వెల్లడించారు. వారి త్వరలోనే రుణమాఫీ చేయబోతున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కో హామీ అమలు చేస్తూ వస్తున్నామని వివరించారు. రుణమాఫీ విషయంలో కూడా కట్టుబడి మొదటి విడత రుణమాఫీని జులై 18న చేసినట్టు పేర్కొన్నారు. మొదటి విడతలో 11,34,412 మంది రైతుల ఖాతాల్లో 6034.97కోట్ల రూపాయలను వేశామని తెలిపారు. రెండో విడత కింద 6190.01 కోట్లు జమ చేశామని వివరించారు. ఆగస్టు 15న మూడో విడత 5644.24 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని గుర్తు చేశారు రేవంత్ రెడ్డి. అంకిత భావంతో వాళ్లకు ఇచ్చిన ప్రతి మాట అమలు చేస్తున్నామని తెలిపారు. వారిపై అప్పుల ఒత్తిడి లేకుండా చేయడమే ధ్యేయంగా పాలసీలు రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. తెలంగాణలో రైతుల సంక్షేమాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు మీ సహాయ సహకారాలు కావాలని ప్రధానమంత్రికి రాసిన లేఖలో రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇద్దరం కలిసి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొదించే ప్రయత్నాలు చేద్దామని పిలుపునిచ్చారు. తాము రైతులకు ఏం చేశామో అన్నీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. అవే తమ చిత్తశుద్ధిని తెలియజేస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీ పథకాన్ని విజయవంతంగా అమలు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మహారాష్ట్రలో శనివారం జరిగిన ఒక బహిరంగ సభలో మీరు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని, దాని అమలు కోసం రైతులు ఇంకా ఎదురుచూస్తున్నారని అన్నారు. మీ ప్రకటన నాకు చాలా బాధ కలిగించింది. అది వాస్తవ విరుద్ధంగా ఉంది. మీకు పూర్తి నిజాలను గణాంకాలు సహా వివరిస్తున్నానను అని వెల్లడించారు. రైతులపై ఆర్థిక భారం తగ్గించి, అప్పుల ఒత్తిడి లేకుండా వారు రాష్ట్ర వ్యవసాయ ఉత్పాదకత పెంపుదలలో కీలక భూమిక పోషించేందుకు దోహదపడుతుందని నమ్ముతున్నాను. రూ.రెండు లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతులు అదనపు మొత్తాన్ని చెల్లిస్తే రూ.2 లక్షలను ప్రభుత్వం జమ చేస్తుంది. కష్టజీవులైన రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని నిర్ణీత కాలపరిమితితో పూర్తి చేసేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లను కేటాయించింది. అర్హత గల ప్రతి రైతుకు రుణమాఫీ చేసేందుకు రూ.31 వేల కోట్లు వెచ్చించేందుకు సిద్ధమయింది. రైతుల సంక్షేమానికే మా ప్రాధాన్యం. వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించే దిశగా ఇద్దరం కలిసి అడుగులు వేద్దాం. రుణమాఫీకి సంబంధించిన అధికారిక సమాచారం మా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంది. మా పారదర్శకతను తెలియజేసేందుకు ఈ వివరాలు మీకు పంపుతున్నాను. రైతుల అభ్యున్నతికి మేం చేస్తున్న ప్రయత్నాలు మా చిత్తశుద్ధిని చాటుతున్నాయని బలంగా నమ్ముతున్నాను. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమివ్వడంలో మా కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలు స్తున్నాయి. తెలంగాణలో రైతుల సంక్షేమాన్ని పెంపొందించేందుకు మీ సహకారం, మార్గదర్శకత్వం కావాలని ప్రధాని మోదీకి రాసిన లేఖలో రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు



తిరుమల,అక్టోబర్7: కలియుగదైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం ఉదయం కల్పవృక్ష వాహన సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుమల మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కల్పవృక్ష వాహనంపై శ్రీవారి వైభవాన్ని తిలకించి భక్తులు పులకించిపోయారు. రాత్రి స్వామివారికి సర్వభూపాల వాహనసేవ జరగనుంది. మరోవైపు బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమలకు భక్తులు పోటెత్తుతున్నారు. దీంతో గోవిందనామ స్మరణతో సప్తగిరులు మార్మోగుతున్నాయి. భక్తులు వాహన సేవలను తిలకించి భక్తిపారవశ్యంలో మునిగి తేలుతున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తిరువీధులు భక్తులతో నిండిపోయి. గోవింత నామస్మరణలతో మారుమోగుతున్నాయి. తిరుమల శ్రీనివాసుని నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మరోవైపు శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వివిధ కళాకారుల సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రధానంగా.. శ్రీవారికి ఘనంగా నిర్వహించే గరుడ వాహనసేవ మంగళవారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 11గంటల వరకు జరగనుంది. ఈ గరుడ వాహన సేవ కోసం టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. గరుడసేవను తిలకించేందుకు లక్షలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి జిల్లా పోలీసులు, టీటీడీ భద్రతాధికారులతో కలిసి భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. దానిలో భాగంగా.. నేటి అర్ధరాత్రి నుంచి కనుమ రహదారుల్లో ద్విచక్రవాహనాలను నిషేధించటంతో పాటు, కొండ కింద అలిపిరి దగ్గర వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన గరుడ సేవకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. మాడవీధుల గ్యాలరీ రెండు లక్షల మంది భక్తులు వాహనసేవను తిలకించేందుకు వీలు ఉందని చెప్పారు. క్యూలైన్ల నుంచి మాడవీధుల కూడలికి పెద్దసంఖ్యలో భక్తులు చేరుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. భక్తులకు అన్న ప్రసాదాలు, పాలు, మజ్జిగ నిరంతరాయంగా పంపిణీ చేస్తామని వెల్లడించారు. అలాగే.. గరుడ సేవను తిలకించేందుకు మాడవీధుల్లో బయట ఉన్న భక్తులకు టీవీ స్క్రీన్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శ్రీవారి గరుడ సేవకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామని తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. ఐదు వేల మంది పోలీసు బలగాలతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గరుడ సేవ రోజున మూడున్నర లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేసినట్లు చెప్పారు. సీసీ కెమెరా నిఘాలో తిరుమల మొత్తం మానిటరింగ్ చేస్తామన్నారు. మరోవైపు.. తిరుమలలో ఎనిమిది వేల వాహనాలకు మాత్రమే పార్కింగ్ సదుపాయం ఉందని, మిగతా వాహనాలను తిరుపతిలో ఏర్పాటు చేసిన ఐదు హోల్డింగ్స్ పాయింట్స్‌లో పార్కింగ్ చేసుకొని.. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా తిరుమలకు రావాలని ఎస్పీ సుబ్బారాయుడు సూచించారు.

## కులగణన కొత్త రాజకీయ ట్రెండ్



పాట్నా,అక్టోబర్7: అన్ని పార్టీలు కులగణనే ఆధారం చేసుకుని రాజకీయాలు నెరపుతున్నాయి. దేశంలో కులాల కుంపట్లు రగిల్చి రాజకీయం చేయాలన్నదే అన్ని పార్టీల ఆలోచన. ఈ విషయంలో బిజెపి మాత్రమే దీనిని వ్యతిరేకిస్తున్నారు. కులాల చిచ్చుతో దేశంలో ఐక్యత దెబ్బతింటుందని బిజెపి హెచ్చరి స్తున్నది. అయినా ఇప్పుడు కులాల ఆధారంగా వారి జీవనస్థితిగతులను, ఆర్థిక స్థితిగుతులను లెక్క వేయలేం. నిజానికి ఆర్థిక స్థితిగతులు ఆధారంగాగణన జరగాలి. పేదలు, అత్యంత పేదలను గుర్తించాలి. అలా గుర్తించి వారిని పైకి తీసుకుని వచ్చేలా ప్రణాళికలు చేయాలి. కానీ ఏ రాజకీయ పార్టీ ఇందుకు సిద్దంగా లేదు. ఇలా చేస్తే ఓట్లు రావని వారి గట్టి నమ్మకం. అందుకే కాంగ్రెస్ కులగణనపై ఆధారపడి రాజకీయాలు చేస్తోంది. నితీశ్ కుమార్ కూడా ఇదే మూసధోరణిలో పోతున్నారు. కులగణను చేపట్టాలని ఆయన ఇంతకు ముందే నిర్ణయించారు. కొత్తగా జన్ సురాజ్ పార్టీ ప్రకటించిన ప్రశాంత్ కిశోర్ కూడా దీనినే నమ్ముకున్నారు. పార్టీ వ్యవస్థాగత నిర్మాణంలోనూ, రేపు ప్రభుత్వంలోనూ ఆయా కులాల జనాభా దామాషా ప్రాతిపదికన పదవుల పంపకాలు ఉంటాయని, ఇటీవలి కులగణనను అందుకు ఆధారంగా చేసుకుంటామని ఆయన ప్రకటించాడు. ప్రజాకర్షణవ్యాఖ్యలు, మిగతాపక్షాలపై విమర్శలను అటుంచితే, పార్టీ నిర్మాణం, ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితర ప్రజాప్రతినిధుల ఎంపిక ప్రక్రియల విషయంలో 'జన్ సురాజ్' అనుసరించబోయే విధానం భిన్నంగా ఉంటుందని ప్రకటించారు. అమెరికా తరహాలో ఆర్నెల్లముందే అభ్యర్థులను ఎంపిక చేయడం, నెగ్గినవారు నచ్చకపోతే వెనక్కురమ్మనడం వంటి ఆసక్తికరమైన ప్రతిపాదనలున్నాయి. కమ్యూనిస్టులనుంచి ఆరెస్సెస్ కార్యకర్తలవరకూ అందరూ తనవారేనంటూ, గాంధీ, అంబేడ్కర్ ప్రవచించిన మానవత్వమే తన పార్టీ ఐడియాలజీ అనీ ఆయన చెప్పుకున్నాడు. తాను పదవులకు దూరంగా ఉండటం, పార్టీ అత్యున్నతస్థానాలకు దళితులు, ఓబీసీలు, మైనారిటీలు ఇత్యాది వర్గాలు నాయకత్వం వహించడం, వంటి నిర్ణయాలు ప్రకటించారు. ఇలాంటి విధానాలన్నీ అట్టడుగుస్థాయిలో జరగడం వంటివి మాటలకు మాత్రమే పరిమితమా, రేపు ఆచరణలో కనిపిస్తాయా అన్నది వేరే విషయం. ఎందుకంటే దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని ఉద్యమ సమయంలో ప్రకటించి, ప్రజలను మోసం చేసిన కెసిఆర్‌ను చూశాం. అలా దళితులు, అణగారిన వర్గాలను ఆకట్టుకునే క్రమంలో తాయిలాలు ఇస్తున్నారు. ఇప్పుడు కులగణన కూడా ఇలాంటిదే. దీనిని చేపట్టి ఏం చేస్తారన్నది చెప్పడం లేదు. మహాత్ముడు తొలి సత్యాగ్రహాన్ని ఆరంభించిన చంపారణ్‌నుంచి ప్రశాంత్ కిశోర్ రెండేళ్ళక్రితం తన పాదయాత్ర మొదలుపెట్టి, మూడువేల కిలోమీటర్ల ప్రయాణంలో ప్రజలతో మమేకం కావడమే కాక, పార్టీకి పునాదులు కూడా వేసుకున్నాడు. ప్రధానంగా వ్యవసాయ, భూసంస్కరణలకు కూడా హామీ ఇచ్చారు. ఇదంతా ఓట్ల రాజకీయమన్నది వేరుగా చెప్పిల్సిన పనిలేదు. రాష్ట్రం నుంచి బ్యాంకులకు సమకూరుతున్నదానిలో నాలుగోవంతు మాత్రమే తిరిగి రుణంగా అందుతున్న తీరును మార్చి, రెట్టింపు వ్యాపార, వ్యవసాయ రుణాలు తేగలనని కొన్ని లెక్కలు చూపారు. ఇది సహజంగానే కొందరికి బాగా నచ్చడంతో కరెక్ట్ అని అంటున్నారు. ఇప్పటికైతే ఆయన చుట్టూచేరిన వారు కూడా దీనిని నమ్ముతున్నారు. దశాబ్దాలుగా వెనుకబడిన బిహార్‌ను ఒకటిరెండు దశాబ్దాల్లో ఉద్ధరించడానికి జన్‌సురాజ్ పార్టీకి నిర్దిష్టమైన ఆచరణమార్గాలు ఉన్నాయని నమ్మబలుకుతున్నారు. అయితే ఏ రాష్ట్రంలో అయినా ఉన్న పార్టీల మీద కొంత అసంతృప్తి, వ్యతిరేకత ఉంటుంది. అలా బీహార్‌లోనూ పరిస్థితులు ఉన్నాయి. అయితే పికె అధికారంలోకి రావడం అంత సులువు అని చెప్పడానికి లేదు.

### తిరుమలకు భారీగా భక్తుల రాక

తిరుమల: తిరుమలలో జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులతో తిరుమల గిరులు కిటకిటలాడుతున్నాయి. గోవిందానామస్మరణతో వీధులు మారుమ్రోగుతున్నాయి. కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులతో కంపార్టుమెంట్లు అన్నీ నిండిపోయి కృష్ణతేజ

## సింగరేణి తెలంగాణకే తలమానికం




హైదరాబాద్,అక్టోబర్7: సింగరేణి తెలంగాణ రాష్ట్రానికే తలమానికమైన సంస్థ. సింగరేణిపై ఆధారపడి ఎన్నో వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపేర్కొన్నారు. సోమవారం ప్రజాభవన్‌లో సింగరేణి కార్మికులకు దసరా బోనస్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. 2023-24 ఏడాదిలో సింగరేణి లాభం రూ.4,701 కోట్లు నమోదయ్యింది. సింగరేణి కార్మికులకు సంతోషంగా బోనస్ ప్రకటిస్తున్నాన్నారు. సింగరేణి కార్మికులకు రూ.796 కోట్లు బోనస్‌గా ప్రకటించాం. ఒక్కో కార్మికుడికి సగటున రూ.1.90 లక్షలు బోనస్ వస్తుంది. సింగరేణిలో శాశ్వత ఉద్యోగులు 41,837. సింగరేణిలో ఒప్పంద ఉద్యోగులకు కూడా బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తరఫున సింగరేణి కార్మికులకు అవసరమైన అన్ని సదుపాయాలను ఏర్పాటుచేస్తామని ఆయన తెలిపారు.సింగరేణి కార్మికులకు బోనస్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ప్రజాభవన్‌లో జరిగింది. కార్మికులకు రూ. 796 కోట్ల బోనస్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు హాజరయ్యారు. 2023-24 సంవత్సరానికి సింగరేణికి రూ.2,412 కోట్ల లాభం వచ్చింది. లాభాల్లో 33 శాతాన్ని కార్మికులకు బోనస్‌గా ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో కార్మికుడికి సగటున రూ.1.9 లక్షలు రానుంది.ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు సింగరేణి లాభాల్లో కార్మికులకు కోతపెట్టాయని అన్నారు. దాదాపు లక్ష మంది పనిచేసే సింగరేణి సంస్థను బతికించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. కార్మికులు సింగరేణి సంస్థకు ఆదాయం తీసుకువస్తున్నారని అన్నారు.'చెన్నూరు, రామగుండంలో నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేశాం. 1800కుపైగా ఉద్యోగ నియామకాలు చేపడుతున్నాం. గతంలో నియామక పక్రియలో చాలా మంది ఇబ్బందులు పడ్డారు. పారదర్శకంగా ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తాం' అని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు.

## జానీ మాస్టర్‌కు అత్యవసర బెయిల్ రద్దు చేయాలంటూ పోలీసుల పిటిషన్



హైదరాబాద్,అక్టోబర్7: అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ మధ్యంతర బెయిల్ రద్దు చేయాలని పోలీసులు కోర్టును కోరనున్నారు. ఈ మేరకు రంగారెడ్డి కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. జానీ మాస్టర్ జాతీయ అవార్డు తీసుకునేందుకు ఈ నెల 6 నుంచి 9 వరకు మధ్యంతర బెయిల్‌ను ఇటీవల కోర్టు మంజూరు చేసింది. ఆయనకు అవార్డును తాత్కాలికంగా నిలిపివేసిన దృష్ట్యా బెయిల్ రద్దు చేయాలని పోలీసులు పిటిషన్ వేయనున్నారు. 2022 సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా జానీ మాస్టర్ ఎంపికయ్యారు. ఈ నెల 8న ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో పురస్కారం అందుకోవాల్సి ఉంది. అయితే తనపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు ఓ సహాయ నృత్య దర్శకురాలు ఆయనపై ఇటీవల నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు కావడంతో అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ అభియోగాల నేపథ్యంలో ఆయనకు ప్రకటించిన అవార్డును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు, ఆహ్వానపత్రికను రద్దు చేస్తున్నట్లు నేషనల్ ఫిల్మ్ అవార్డు సెల్ ప్రకటించింది.

## రేవంత్ పాలన తీరుపై కెటిఆర్ విమర్శలు



హైదరాబాద్,అక్టోబర్7: మింగమెతుకు లేదు మీసాలకు సంపెంగ నూనె అన్న చందంగా రేవంత్ పాలన సాగుతోంది. కెటిఆర్‌ఎ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చి పది నెలలు అవుతున్నా.. ఒక్క సంక్షేమ, అభివృద్ధి పథకం అమలుకు నోచుకోలేదు. రేవంత్ రెడ్డి పరిపాలన ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. ఏ ఒక్క వర్గానికి కూడా ఇప్పటి వరకు ఒక్క సంక్షేమ పథకం అందలేదు. ఈ క్రమంలో రేవంత్ సర్కార్‌పై రాష్ట్ర ప్రజానీకం తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.ఈ పరిస్థితుల నేపథ్యంలో రేవంత్ సర్కార్ పరిపాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. మింగ మెతుకు లేదు.. కానీ మీసాలకు మాత్రం సంపెంగ నూనె కావాలె అన్నట్టునది రేవంత్ వైఖరి అని కేటీఆర్ విమర్శించారు. తెల్లారి లేస్తే బీద అరుపులు. రాష్ట్రం అప్పుల పాలైంది అని, డబ్బులు లేవని. మరొకవైపు మూసీ పేరిట ఈ లక్షయాభై వేల కోట్ల సోకులు, ఆర్భాటం ఎవరికోసం? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా రేవంత్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేటీఆర్ మరోసారి గుర్తు చేశారు.

## సంపాదకీయం

మంగళవారం 08-10-2024

# గతాన్ని పరిరక్షిస్తేనే.. భవిష్యత్తు!

ఇటీవల మనం ఒక శుభవార్త విన్నాం. ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చాలని కోరుతూ 10 జియోలాజికల్ సైట్ల పేర్లను ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు కేంద్ర ప్రభుత్వం పంపించింది. ప్రస్తుతం దేశంలో 100కు పైగా జియో- హెరిటేజ్ సైట్లు ఉన్నాయి. వాటిలో 34 మాత్రమే నేషనల్ జియోలాజికల్ మాన్యుమెంట్స్‌గా గుర్తింపు పొందాయి. భూమికి సంబంధించిన చరిత్రను తెలుసుకోవడంలో కీలకపాత్ర పోషించే వాటిని లేదా భౌగోళికంగా ఎర్త్ సైన్స్ పరంగా ప్రాధాన్యం ఉన్న స్థలాలను జియో- హెరిటేజ్ సైట్లుగా వ్యవహరిస్తుంటారు.తెలంగాణ విషయానికి వస్తే ఇక్కడ భౌగోళిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. పాండవుల గుట్ట హిమాలయాల కంటే ముందు నుంచీ ఉన్నదని చెప్పేందుకు ఆధారాలు లభ్యమవుతున్నాయి. అదే విధంగా కరీంనగర్, కొత్తగూడెం, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో రాక్షస బల్లుల శిలాజాలు, ప్రాచీన కాలపు తాబేళ్లు, ఇతర జంతువుల పాదముద్రలు కూడా బయటపడ్డాయి. సాధారణంగా ఆర్కియలాజికల్ సైట్లకు చట్టపరమైన భద్రత ఉంది. జియో- హెరిటేజ్ సైట్లకు మాత్రం అలాంటి భద్రత లేదు. ఈ నేపథ్యంలోనే జియోలాజికల్ హెరిటేజ్ రక్షణే ధ్యేయంగా జియో-హెరిటేజ్ సైట్స్ అండ్ జియో రెలిక్స్ బిల్లు 2022 రూపుదిద్దుకుంది. త్వరలోనే ఇది చట్టరూపం దాల్చే అవకాశం కూడా ఉంది. ప్రపంచవ్యాప్తంగా 1200 దాకా ప్రపంచ వారసత్వ ప్రదేశాలున్నా యి. ఇందులో 43 భారత్‌కు చెందినవి. వీటిలో జియోలాజికల్ సైట్ ఒక్కటి కూడా లేదు.జియోలాజికల్ సైట్లకు ఉన్న ప్రాధాన్యం నేపథ్యంలో అక్టోబర్ 6న అంతర్జాతీయ జియో డైవర్సిటీ డేను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జియోలాజికల్ సైట్లకు కూడా వివిధ రకాల గుర్తింపులు లభిస్తే వాటిని పరిరక్షించుకోవడం మరింత తేలికవుతుంది. దేశంలో వందకు పైగా అద్భుతమైన జియోలాజికల్ సైట్లు ఉన్నప్పటికీ, సమాజంలో మాత్రం వాటి పరిరక్షణ విషయంలో అంతగా అవగాహన ఉండటం లేదు. మహారాష్ట్రలోని లూనార్ క్రేటర్, మధ్యప్రదేశ్‌లోని భేడా ఘాట్, ఆంధ్రప్రదేశ్‌లోని గండికోట లోయ, తెలంగాణలోని పాండవుల గుట్ట.. ఇలా మరెన్నో అద్భుతమైన జియోలాజికల్ సైట్లు మన దేశంలో ఉన్నాయి. వీటిలో అనేకం పర్యాటక కేంద్రాలుగా మారాయే తప్ప వాటి భౌగోళిక ప్రాధాన్యం మాత్రం అంతగా ప్రాచుర్యంలోకి రావడం లేదు. వాటి రక్షణ విషయాన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇలాంటి వాటికి యునెస్కో గ్లోబల్ జియోపార్క్ గుర్తింపు లభిస్తే అవి మరింతగా ప్రాచుర్యంలోకి వచ్చే అవకాశం ఉంటుంది.జియో పార్కుల భావనకు రెండు దశాబ్దాలకు పైగా చరిత్ర ఉంది.గ్లోబల్ జియోపార్క్స్ నెట్‌వర్క్ (జీజీఎన్) 2024 అక్టోబర్ 6న అంతర్జాతీయ జియో డైవర్సిటీ డేను నిర్వహిస్తోంది. ఈ వేడుకను నిర్వహించుకోవడం అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న జియోలాజికల్ హెరిటేజ్ సైట్లను కాపాడుకోవడం, భూమి చరిత్రకు గుర్తుగా వాటిని సంరక్షించుకోవడం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ దినోత్సవం తోడ్పడుతుంది. ఈ సంవత్సరం గ్లోబల్ జియోపార్క్స్ నెట్‌వర్క్ తన 20వ వార్షికోత్సవాన్ని కూడా నిర్వహించుకోవడం ఓ విశేషం. 2021లో యునెస్కో అంతర్జాతీయ జియోడైవర్సిటీ డేను ప్రకటించింది. నాటి నుంచి ఏటా ఈ దినోత్సవాలు జరుగుతున్నాయి.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 48 దేశాల్లో 213 యునెస్కో గ్లోబల్ జియోపార్కులు ఉన్నాయి. ఏటా కొత్తగా పది నుంచి ఇరవై దాకా విభిన్న స్థలాలను వాటికి జోడిస్తుంటారు. ఇదే విధమైన గుర్తింపును జాతీయ స్థాయిలో ప్రకటించడం కూడా ఈ స్థలాల పరిరక్షణకు, అవి ప్రాచుర్యంలోకి వచ్చేందుకు తోడ్పడుతుంది. ఇటీవలే తెలంగాణలో పాండవుల గుట్టకు ఈ విధమైన గుర్తింపు లభించింది. ఇలాంటి గుర్తింపు పొందిన ప్రాంతం తెలంగాణలో ఇదొక్కటే కావడం విశేషం. ఇప్పుడిప్పుడే జియో డైవర్సిటీ భావన ప్రజల్లోకి వెళ్తోంది. దక్కన్ హెరిటేజ్ అకాడమీ, పర్యావరణ, సాంస్కృతిక సంస్థలు, కొంతమంది వ్యక్తులు కొన్నేళ్లుగా ఈ అంశంపై విశేషమైన కృషి చేస్తున్నారు.తెలంగాణ విషయానికి వస్తే ఇక్కడ భౌగోళిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. పాండవుల గుట్ట హిమాలయాల కంటే ముందు నుంచీ ఉన్నదని చెప్పేందుకు ఆధారాలు లభ్యమవుతున్నాయి. అదే విధంగా కరీంనగర్, కొత్తగూడెం, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో రాక్షస బల్లుల శిలాజాలు, ప్రాచీన కాలపు తాబేళ్లు, ఇతర జంతువుల పాదముద్రలు కూడా బయటపడ్డాయి. ఇవన్నీ 160 నుంచి 200 మిలియన్ సంవత్సరాల కిందటివని అంచనా. హైదరాబాద్‌లోని మౌలాలీ పహాడ్‌కు కూడా అద్భుతమైన వారసత్వ ప్రాధాన్య చరిత్ర ఉంది. వీటిని గనుక మనం కోల్పోతే తిరిగి తెచ్చుకోలేం. యావత్ భూగోళ చరిత్ర వారసత్వం వాటికి ఉంది. అందుకే ఇలాంటి భౌగోళిక వైవిధ్య ప్రాంతాలను కాపాడుకునేందుకు ప్రజలే ముందుకు రావాలి. శిలా రాతి యుగం నుంచి లోహ యుగం దాకా ప్రాచీన చరిత్రను తమలో దాచుకున్న ప్రాంతాలెన్నో తెలంగాణలో ఉన్నాయి. పాండవుల గుట్ట, భువనగిరి, దేవరకొండ, ఉంద్రు కొండ, బొమ్మలమ్మ గుట్ట లాంటి ఎన్నో కొండలు, ప్రదేశాలు, ప్రాంతాలు దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఇప్పటికైనా ఈ ప్రాంతాల విశేషాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం, ప్రజలు నడుం బిగించాల్సిన అవసరం ఉంది.పాండవుల గుట్ట విషయానికి వస్తే.. తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇది ఉంది. 1990 కన్నా ముందే దీని ప్రాధాన్యం వెలుగులోకి వచ్చింది. ప్రాచీన కాలపు పెయింటింగ్‌లు, గుహలు, ప్రాచీన ఆవాసాలకు సాక్ష్యాధారాలు ఇక్కడ ఉన్నాయి. ఈ పెయింటింగ్‌లలో ఎద్దు, పులి లాంటి జంతువుల బొమ్మలు, వృత్తాలు, చతురస్రాలు, రేఖాగణిత సంబంధిత చిత్రాలు, స్వస్తిక్ చిహ్నం, విల్లు, బాణాలు, కత్తి లాంటి చిత్రాలు ఉన్నాయి.భూమి చరిత్రకు సంబంధించిన విశేషాలను జియో హెరిటేజ్ సైట్లు అందిస్తాయి. భూమి గతాన్ని ఇవి చాటిచెబుతాయి. సెయింట్ మేరీ ఐలాండ్‌లోని కాలమర్ బసాల్ట్ కావచ్చు, లేదంటే మహారాష్ట్రలోని లోనార్ క్రేటర్ కావచ్చు.. ఇవన్నీ కూడా అగ్నిపర్వతాల పేలుళ్లు, ఉల్కాపాతం, ప్రాచీన మానవ ఆవాసాలు.. ఇలా ఎన్నో విశేషాలకు సాక్ష్యాలు. అందుకే జియోలజిస్టులు, ఇతర పరిశోధకులను ఇవి అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రాచీన కాలపు శీతోష్ణస్థితులు, భూమి పొరలు, పర్వతాలు రూపుదిద్దుకున్న క్రమం ఇలా మరెన్నో విశేషాలను ఇవి అందిస్తాయి.దేశంలో ఇప్పటి వరకు 34 ప్రదేశాలను నేషనల్ జియోలాజికల్ మాన్యుమెంట్లుగా గుర్తించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఓల్కనోజెనిక్ బెడెడ్ బైరెట్స్ (మంగంపేట), తిరుపతి ఎపర్చీన్ అన్ కన్ఫార్మిటీ (చిత్తూరు), తిరుమల సహజ శిలాతోరణం, ఎర్రమట్టి దిబ్బలు (విశాఖపట్నం) ఈ విధమైన గుర్తింపు పొందా యి. తెలంగాణలో పాండవుల గుట్టకు ఈ గుర్తింపు లభించింది. కేరళలో అంగాడిపురం లేటరైట్ (మల్లాపురం), వర్కాల క్లిఫ్ సెక్షన్ (వర్కాల), తమిళనాడులో నేషనల్ ఫాసిల్ ఉడ్ పార్క్ (పెరంబలూర్), సెయింట్ థామస్ వర్స్కోక్సైట్, కరాయ్ బద్లాండ్స్ ఫార్మేషన్ ఫాసిల్ పార్క్(పెరంబలూర్), గుజరాత్‌లోని ఎడ్డీ కరెంట్ మార్కింగ్ సెడిమెంటరీ స్ట్రక్చర్స్ (మహిసాగర్), రాజస్థాన్‌లోని సెంద్రా గ్రానై ట్.. ఇలా పలు రాష్ట్రాల్లో మొత్తం 34 ప్రదేశాలు ఈ విధమైన గుర్తింపు పొందాయి.

# మధ్యప్రాచ్యంలో మారణహోమం

చిలికి చిలికి గాలి వానలా మారిన చందంగా చిన్నచిన్న దాడులతో, మాటల తూటాలతో ప్రారంభమైన ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య సంఘర్షణ పెనుయుద్ధానికి దారితీసే విధంగా మారింది. ఇజ్రాయెల్ చర్యలకు ప్రతీకారేచ్ఛతో రగిలిపోయిన ఇరాన్ ఎట్టకేలకు జూలు విదిల్చి కదన రంగంలోకి పరుగులు తీసింది. వందలాది క్షిపణులతో ఇజ్రాయెల్ మీద దాడులకు తెగబడింది. లెబనాన్‌లోకి చొచ్చుకుపోయి దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ హెజ్బొల్లా స్థావరాలను ధ్వంసం చేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నది. ఇజ్రాయెల్ హెజ్బొల్లాను మట్టికరిపించడానికి తీవ్రమైన దాడులకు తెగబడడమే కాకుండా హెజ్బొల్లా, హమాస్ నేతలను చంపడాన్ని ఇరాన్ జీర్ణించుకోలేక పోయింది.హమాస్ అధిపతి ఇస్మాయిల్ హనియే, హెజ్బొల్లా అధినేత నస్రల్లా హత్యలకు ప్రతీకారంగా ఇరాన్ వందలాది క్షిపణులతో ఇజ్రాయెల్‌పై విరుచుపడడం, ప్రతీకార దాడులకు పాల్పడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఇజ్రాయెల్‌ను హెచ్చరించడం, దీనికి బదులుగా ఇజ్రాయెల్ తాము ఇరాన్‌ను కోలుకోలేనంత దెబ్బ తీస్తామని హుంకరించడం శాంతి కాముకులను తీవ్రమైన కలవరపాటుకు గురిచేసింది. ఇరాన్ క్షిపణి దాడులు చేస్తుందని అమెరికా ఇజ్రాయెల్‌కు ముందస్తు సమాచారమందించినా ఇజ్రాయెల్ సరిగా స్పందించలేదనే చెప్పాలి. గతంలో గాజాలో ఇజ్రాయెల్ జరిపిన మారణహోమంలో పసి పిల్లలతో సహా అనేక మంది అమాయక ప్రాణాలు బలి అయ్యారు. గత సంవత్సరం ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన అనూహ్యమైన దాడులే ఇజ్రాయెల్ ఆగ్రహానికి కారణంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.ఈ దాడుల్లో అనేక మంది ఇజ్రాయెల్ సైనికులు, పౌరులు చనిపోయారు. ఈ సంఘటన జరిగిన వెంటనే ఇజ్రాయెల్ గాజాలో రక్తపాతం సృష్టించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ విరామం లేకుండా విద్రోహుల ఏరివేతకు ఇజ్రాయెల్ బహుముఖ వ్యూహాలను రచిస్తూ ముందుకు సాగుతున్నది. హమాస్ విషయంలో దూకుడు ప్రదర్శించిన ఇజ్రాయెల్ ఇరాన్ విషయంలో కూడా ఇదే పంథా అనుసరించింది. ఇప్పటివరకు మాటలతో సరిపెట్టిన ఇరాన్ తమనేమీ చేయలేదని ఇజ్రాయెల్ భావించింది. కాని ఇరాన్ ఎదురు తిరిగే సరికి ఇజ్రాయెల్ వెన్నులో వణుకుపుట్టింది. అమెరికా అండతో హెజ్బొల్లాపై దాడులను తీవ్రతరం చేసి లెబనాన్ లోకి చొచ్చుకుపోయింది. ఇరాన్ ప్రతీకార దాడులతో ఇజ్రాయెల్‌ను నిశ్చేష్టపరిచింది. మధ్యప్రాచ్యంలో మారణ హోమం హోరెత్తిపోతున్నది. యుద్ధాలతో విసుగెత్తిన ప్రజలంతా ఇరాన్, ఇజ్రాయెల్ ధోరణుల పట్ల ఆందోళన చెందుతున్నారు. సిరియా, గాజా, లెబనాన్లు ఇజ్రాయెల్ దాడులతో భీతిల్లుతున్నాయి.హమాస్, హెజ్బొల్లాల వైఖరి తో ప్రజలు విసిగిపోతున్నారు. టెల్అవీవ్, జెరూసలేం నగరాలపై ఇరాన్ క్షిపణులతో దాడులు చేస్తుంటే అమెరికా ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలుస్తున్నది.ప్రతీ యుద్ధం వెనుక అమెరికా ప్రత్యక్ష, పరోక్ష హస్తం ఉండడం గమనార్హం. మిడిల్ ఈస్ట్ దేశాల్లో సౌదీ అరేబియా, ఇరాన్, ఈజిప్టు, టర్కీ ఇరాక్, యుఎఇ, జోర్డాన్‌లు అత్యధిక జనాభా గల దేశాలు. సౌదీ అరేబియా అత్యధిక చమురు నిల్వలతో, యునైటెట్ అరబ్ ఎమిరేట్స్‌లు ఆర్థిక బలంలో అగ్రగామిగా ఉన్నాయి. కేవలం కోటి జనాభా గల ఇజ్రాయెల్, 9 కోట్ల జనాభా గల ఇరాన్‌తో పోటీపడగలదా? అనే సందేహం సహజం. జనాభా పరంగా చిన్న దేశమైనా ఆయుధ బలంలోను, సాంకేతిక పరిజ్ఞానంలోను ఇజ్రాయెల్ ప్రపంచంలో ఒక ప్రబలమైన శక్తిగా అవతరించింది. ఇరాన్ ఆర్థిక బలం చమురు క్షేత్రాలు. ఇరాన్ ధైర్యం అణుస్థావరాలు.ఈ రెండింటినీ నాశనం చేస్తే ఇరాన్ ఆర్థికంగా దెబ్బ తింటుందని ఇజ్రాయెల్ భావిస్తున్నది. ఒకప్పుడు ఇజ్రాయెల్ అంటే గిట్టని దేశాలు ఆ దేశం ఉనికిని గుర్తించడానికే వెనకంజవేసిన తరుణంలో ఇరాన్ ఇజ్రాయెల్‌ను ఒక దేశంగా గుర్తించి చమురు సరఫరా చేసింది. ఇజ్రాయెల్, ఇరాన్‌లు చాలా కాలం మిత్రదేశాలుగా ఉన్నాయి. యూదులు, ముస్లింలు ఇజ్రాయెల్‌లో మెజారిటీ మతస్తులు కాగా, కేవలం రెండు శాతం జనాభాతో క్రైస్తవులు మైనారిటీలుగా మనుగడ సాగిస్తున్నారు. ఇజ్రాయెల్ ఆవిర్భావ సమయంలో పలు ముస్లిం దేశాలు ఇజ్రాయెల్‌ను వ్యతిరేకించాయి. ఇప్పుడు కూడా ఇజ్రాయెల్‌కు ముస్లిం దేశాల అండలేదు. ఇస్లాం వ్యాప్తి వలన ఇరాన్, ఇజ్రాయెల్‌ల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ప్రస్తుత యుద్ధంలో ఇరాన్ వైపు రష్యా, చైనా లాంటి దేశాలు మొగ్గు చూపితే, అగ్రరాజ్యమైన అమెరికా, దాని మిత్ర దేశాలు ఇజ్రాయెల్‌కు అండగా నిలబడి,



హోరాహోరీగా యుద్ధం చేసే అవకాశాలున్నాయని కొన్ని వార్తా కథనాలు చెబుతున్నాయి.ఒక వైపు రష్యా ఉక్రెయిన్‌పై యుద్ధం జరుపుతుంటే, మరోవైపు ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో రష్యా ఇరాన్ వైపు నిలబడే అవకాశముంది. అమెరికా ప్రత్యక్షంగా ఇజ్రాయెల్‌కు సహకారమందించడం వలన గతంలో మాదిరిగానే ప్రపంచ దేశాలు రెండుగా చీలిపోయే అవకాశముంది. ఇరాన్, ఇజ్రాయెల్ బలాబలాల విషయానికొస్తే ఇజ్రాయెల్ చిన్న దేశమైనా, ఆయుధ బలం మెండుగానే ఉంది. గగనతల దాడుల విషయంలో ఇజ్రాయెల్ శక్తిసామర్థ్యాలను తక్కువగా అంచనా వేయలేం. అమెరికా మద్దతు ఇజ్రాయెల్‌కు అపరిమితమైన బలాన్ని అందిస్తున్నది. ఇరాన్ ఇజ్రాయెల్ కంటే ఆర్థికంగాను, ఆయుధ పరంగాను ఉచ్ఛస్థితిలో ఉన్న మాట వాస్తవం. చమురుతో పాటు వ్యవసాయం, సేవా రంగాలు, తయారీ రంగం ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు ఆలంబనగా నిలుస్తున్నాయి. ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం వలన ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగే అవకాశముంది.రష్యా భారత్ కు చమురును సరఫరా చేయడంలో ముందంజలో ఉంది. ఇరాక్ భారత్‌కు రెండవ ప్రధాన చమురు సరఫరాదారుగా ఉండడంతో చమురు విషయంలో భారత్ కొంత వరకు భద్రంగానే ఉన్నట్టు భావించవచ్చు. అయితే ఇరాన్ ఇజ్రాయెల్ ఘర్షణ వలన పశ్చిమాసియా దేశాలకు భారత్ చేసే ఎగుమతులు స్తంభించిపోవచ్చు. ఇరాన్‌తో భారత్‌కు చిరకాలంగా సన్నిహిత సంబంధాలున్నా, వాణిజ్య సంబంధాలున్నా ఇరాన్‌లో ఏర్పడిన నూతన ప్రభుత్వం భారత్ పట్ల సరైన ధోరణిలో ప్రవర్తించడం లేదు. భారత్‌కు ఇజ్రాయెల్‌తో వాణిజ్య సంబంధాలు పటిష్టంగా ఉన్నాయి. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు బలంగా ఉన్నాయి. గత ప్రభుత్వాలు పాలస్తీనాకు అనుకూలంగా వ్యవహరించినా, ప్రస్తుత మోడీ ప్రభుత్వం ఇజ్రాయెల్ పట్ల సానుకూల దృక్పథం ప్రదర్శించడం ఇరాన్‌కు కంటగింపుగా మారింది. భారత్‌కు మిత్రదేశమైన రష్యా ఇరాన్‌కు మద్దతునిస్తూ ద్విముఖ వ్యూహం అవలంబిస్తున్నది.అమెరికా ఎప్పటికీ చైనా ఆధిపత్యాన్ని సహించలేదు. ఒక మిత్రదేశం రష్యా, మరో శత్రు దేశం చైనా ఇరాన్‌కు మద్దతుగా నిలిచే అవకాశముంది. ఉక్రెయిన్ యుద్ధంలో అమెరికా ఉక్రెయిన్‌కు ఆర్థిక, ఆయుధ సహకారం అందిస్తూ ప్రత్యక్షంగా రష్యా పై తిరుగుబాటు జెండా ఎగరేసింది. భారత్, చైనాలు తటస్థంగా ఉండిపోయాయి. ఇరాన్ విషయంలో భారత్ తటస్థ వైఖరి అవలంబించే అవకాశాలున్నా, చైనా మాత్రం రష్యాతో పాటుగా ఇరాన్‌కు తోడుగా నిలిచే అవకాశముంది. కొన్ని ముస్లిం దేశాలు ఇరాన్- ఇజ్రాయెల్ విషయంలో ఎలాంటి వైఖరి ప్రదర్శిస్తాయో తెలియదు. గ్లోబలైజేషన్ వలన వాణిజ్య ప్రయోజనాల కారణంగా ప్రతి దేశం గతంలో మాదిరిగా గుడ్డిగా ఏ దేశాన్ని సమర్థించే సాహసం చేయకపోవచ్చు. ప్రతి దేశం తమ దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి, ఆర్థిక ఇబ్బందులను కోరి తెచ్చుకునే పరిస్థితులు లేవు. కొన్ని మీడియా హౌస్‌లు వెలువరిస్తున్న కథనాలను ఆధారంగా చేసుకుని, ఇరాన్- ఇజ్రాయెల్‌ల మధ్య జరిగే ఘర్షణలు మూడవ ప్రపంచ యుద్ధానికి దారి తీయవచ్చునని చెప్పడం కూడా కేవలం ఊహాజనితమే.మూడవ ప్రపంచం యుద్ధం జరిగితే ఏమవుతుందో యుద్ధోన్మాద దేశాలకు సైతం తెలుసు. అలాగే ఏ దేశం కూడా అణ్వాస్త్ర ప్రయోగాలు జరిపే సాహసం చేయకపోవచ్చు. శత్రుసైన్యాలను మట్టుబెట్టడం, అమాయక ప్రజలను చంపడం, ఆర్థిక పునాదులను ధ్వంసం చేసి తమ అహాన్ని తృప్తిపరచుకోవడమే ఇరాన్ ఇజ్రాయెల్ ల మధ్య చెలరేగిన యుద్ధోన్మాద

# ఆపరేషన్ రాబందు! నక్సల్స్ జాడ కోసమే వచ్చిందా?



సెంట్రల్ డెస్క్: దండకారణ్యంలోని ఓ సురక్షిత ప్రాంతంలో భారీ వర్షంలో తలదాచుకున్న మావోయిస్టుల జాడ ఎలా బయటపడింది? మావోయిస్టుల కొరియర్లు పోలీసులకు దొరికారా? వారి సమాచారంతోనే ధులి ధులి ప్రాంత అడవిని పోలీసులు అంచనా వేశారా? అనే అంశాలు చర్చకు వస్తున్నాయి. అయితే.. మానవ హక్కుల సంఘాలు మాత్రం మరో కొత్త అంశాన్ని తెరమీదకు తీసుకువచ్చాయి. ఎన్‌కౌంటర్ జరగడానికి సరీగా మూడు రోజుల కిందట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని ఏకలవ్య పాఠశాల నిర్మాణ ప్రాంతానికి ఓ రాబంధు వచ్చింది. దీన్ని గిరిజనులు మచ్చిక చేసుకుని కోడి మాంసం పెట్టారు.అయితే.. ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావటంతో గిరిజనులు దాన్ని విడిచిపెట్టారు.కానీ,అటవీ,పోలీసు,రెవెన్యూ శాఖల అధికారులు ఈ రాబందును పట్టుకునేందుకు నానా తంటాలు పడ్డారు. ఎట్టకేలకు రాబందు దొరికింది. అది మధ్య ప్రదేశ్‌లోని పెన్న టైగర్ జోన్‌లోని వల్చర్ పాయింటు నుంచి దండకారణ్యానికి వచ్చినట్టు అధికారులు తేల్చి చెప్పారు.

### ఎన్నో అనుమానాలు..

ఇక్కడే పౌరహక్కుల సంఘాలు, సామాన్య జనం నుంచి అనేక అనుమానాలను వ్యక్తం అవుతున్నాయి. ఇది నిజంగా రాబందు జాతి అన్వేషణకు వచ్చిన పక్షేనా? అదే నిజమైతే, ఈ పక్షి జనం మధ్యకు ఎందుకు వస్తుంది? తన ఆహారం కోసం సహజ సిద్ధంగా కళేబరాలను వెతకాలి కదా? జనం చెంతకు ఎందుకు చేరుతుంది? కాళ్లకు జీపీఎస్, అత్యంత ఆధునిక కెమెరాను పెన్న అధికారులు బిగించారంటే.. ప్రభుత్వ అధికారులే భద్రత దళాల ఆపరేషన్ కోసం రాబందును సృష్టించారా? అనే అనుమానాలను పౌరసంఘాల నేతలు వ్యక్తం చేస్తున్నారు.ఎందుంటే.. చర్ల మండలంలో ఈ రాబందు ప్రత్యక్షం కావటంతో.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దండకారణ్యం మార్మోగిపోయింది. రాబందు ఫోటోను ఇటు మావోయిస్టులు, అటు పోలీసులు .. పౌరహక్కుల సంఘాలు నిశితంగా పరిశీలించటంతో.. అనేక అనుమానాలు తెరమీదకు వచ్చాయి.

### సరికొత్త పంథాలో పోలీసు బలగాలు

ఇప్పటికే దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కేంద్ర పోలీసు బలగాలు జల్లెడ పడుతున్నాయి. ల్యాండ్ మైన్ల కారణంగా భారీగా నష్టపోయిన సీఆర్పీఎఫ్ బలగాలు.. మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. మావోయిస్టుల ట్రాప్ లో పడకుండా తమ ఆచూకీ కోసం సరికొత్త పంథా అనుసరిస్తున్నాయి. ఈ క్రమంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నాయి. ఓ వైపు డ్రోన్ల సాయంతో అణువణువూ పరిశీలిస్తున్నాయి.నిఘా పెంచిన క్రమంలోనే రాబందులను కూడా వినియోగిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమను ఏరివేసేందుకు పోలీసులు డ్రోన్లను ఉపయోగిస్తున్నారని, అటవీ గ్రామాల్లో భయానక పరిస్థితులు సృష్టిస్తున్నారని మావోయిస్టు నేతలు గతంలో ఆరోపణలు చేయడం విదితమే. ఈ నేపథ్యంలో తాజాగా మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న చర్ల పరిసరాల్లో రాబందు ప్రత్యక్ష్యం కావడం ఈ ఆరోపణలు బలాన్నిచ్చింది.

### సమాచార వ్యవస్థ లేని మావోయిస్టులు..

ఇక.. మావోయిస్టులు ఇప్పుడు పూర్తిగా డిఫెన్సులో ఉన్నారు. ఇప్పుడు వీరికి ఎలాంటి సమాచార వ్యవస్థ లేదా గూఢచార వనరులు లేవు. 31 మంది నక్సలైట్ల మరణమే ఇందుకు నిదర్శనం. గడచిన 11 రోజుల్లో ఇది మూడో ఎన్‌కౌంటర్. సెప్టెంబర్ 24న కూడా సుక్మా జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు నక్సలైట్లు హతమయ్యారు.ఇద్దరి మృతదేహాలను సహచరులు ఎత్తుకెళ్లారు. నిజానికి మావోయిస్టు నేతలు అడవుల్లో సమావేశాలకు ప్లాన్ చేస్తున్నప్పుడు సైనికుల ఆనుపానులను ముందే గుర్తిస్తారు. భారీ వర్షం కారణంగా పర్వతం మీద ఒక ప్రదేశంలో ఆగి, వర్షం ఆగేవరకూ వేచి ఉన్నారని చెబుతున్నారు.కానీ పర్వతం మీదన్న మావోయిస్టులు కూడా పహారాలో ఎక్కడా తగ్గరు. కనీసం రెండు మూడు కిలో మీటర్ల దూరంలోని శత్రువును పసిగట్టగలరు. పది కిలోమీటర్లు చిత్తడి నేలలో 1500 మంది బలగాలు టార్గెట్టుకు చేరాయంటే.. పకడ్బందీ సమాచారంతోనే ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్టు పౌరహక్కుల సంఘాల ప్రతినిధులు అంచనా వేస్తున్నారు.జీపీఎస్, కమాండ్ కంట్రోల్ సమాచారాన్ని ముందే పసిగట్టి భద్రతాదళాలకు ఉప్పు అందించటంతోనే ఇంత భారీ ఎన్ కౌంటర్ చోటు చేసుకుందని, ఈ ఆపరేషన్ లో రాంబధు కూడా భాగస్వామే అని పౌరహక్కుల సంఘాలు అనుమానిస్తున్నాయి.

# సౌదీ ఎడారి నుంచి స్వదేశానికి నిర్మల్ జిల్లావాసి

హైదరాబాద,కువైట్ – సౌదీ అరేబియా సరిహద్దుల్లోని ఎడారిలో ఒంటెల కాపరిగా కష్టాలు అనుభవించిన నిర్మల్ జిల్లావాసి రాథోడ్ నాందేవ్ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చొరవతో ఇటీవల రియాద్ నుంచి హైదరాబాద్‌కు క్షేమంగా చేరుకున్నాడు. నిర్మల్ జిల్లా ముధోల్ మండలం రూవి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్ అనే గిరిజనుడు ఇంటిపని వీసాపై కువైట్ వెళ్లాడు. అరబ్బు యజమాని అతన్ని కువైట్ నుంచి అక్రమంగా సౌదీకి తరలించి ఒంటెల కాపరి పని చేయించాడు. యజమాని హింసను తట్టుకోలేకపోతున్నానని, నిత్యం నరకం అనుభవిస్తున్నానని, ఎడారి నుంచి నన్ను రక్షించండి అంటూ రాథోడ్ నాందేవ్ ఆగస్టులో సీఎం రేవంత్ రెడ్డిని వేడుకుంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తూ పంపిన ఒక సెల్ఫీ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ జీఏడీ ఎన్నారై శాఖ అధికారులు కువైట్, సౌదీ అరేబియా రెండు దేశాల్లోని ఇండియన్ ఎంబసీలతో, అక్కడి సామాజిక సేవకులతో, ఢిల్లీలోని విదేశాంగ శాఖతో సమన్వయం చేసి నాందేవ్ ను రక్షించి స్వదేశానికి వచ్చేలా చేశారు. ఈ సందర్భంగా మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి, కాంగ్రెస్ ఎన్నారై సెల్ నాయకులు మంద భీంరెడ్డి, చెన్నమనేని శ్రీనివాస రావు, స్వదేశ్ పరికిపండ్ల, నంగి దేవేందర్ లతో పాటు గల్ఫ్ బాధితుడు రాథోడ్ నాందేవ్ తన కుటుంబ సభ్యులతో శనివారం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

# దలాల్ స్ట్రీట్‌లో యుద్ధ భయాలు

ముంబయి,దలాల్ స్ట్రీట్‌లో యుద్ధ భయాలు అలముకొన్నాయి. ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య ముదురుతున్న ఘర్షణ వాతావరణం మార్కెట్‌ను కుదిపేసింది. దీంతో సూచీలు కకావికలమయ్యాయి. దీనికి ఎఫ్అండ్ఓ ట్రేడింగ్‌పై సెబీ తీసుకున్న కఠిన నిర్ణయాలూ తోడయ్యాయి. ముఖ్యంగా రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. దీంతో సెన్సెక్స్ 1750కి పైగా పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 25,250 స్థాయికి చేరింది. మదుపర్ల సంపద దాదాపు రూ.11 లక్షల కోట్లు ఆవిరైంది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.464.3 లక్షల కోట్లకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో ఆరంభంలోనే సూచీలు భారీ నష్టాలు చవిచూశాయి. ఉదయం 83,002.09 వద్ద నష్టాల్లో ప్రారంభమైన (క్రితం ముగింపు 84,266) సెన్సెక్స్ రోజంతా పడుతూనే ఉంది. ఇంట్రాడేలో 82,434.02 వద్ద కనిష్టాన్ని తాకిన సూచీ చివరికి 1769.19 పాయింట్ల నష్టంతో 82,497.10 వద్ద ముగిసింది. నిఫ్టీ 546.80 పాయింట్ల నష్టంతో 25,250.10 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.97 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ (1.18 శాతం) మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టపోవడం గమనార్హం. ఎల్అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్, రిలయన్స్, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ మళ్లీ 75.27 డాలర్ల స్థాయికి చేరింది. బంగారం ఔన్సు 2665.10 డాలర్ల వద్ద కొనసాగుతోంది. పశ్చిమాసియాలోని ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ఎటువైపు దారితీస్తాయోనన్న ఆందోళనలు మదుపర్లలో నెలకొన్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న భయాల నేపథ్యంలో ముడి చమురు ధరలు పెరగడం మరో కారణం. ఇన్నాళ్లు 70-71 డాలర్ల వద్ద కొనసాగిన బ్యారెల్ ముడి చమురు ధర 75 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌కు సంబంధించి నిబంధనలను ఇటీవల సెబీ కఠినతరం చేయడం కూడా మార్కెట్ నష్టాలకు మరో కారణం. ఇటీవల చైనా ప్రభుత్వం ప్రకటించిన ఉద్దీపన చర్యలతో ఆ దేశానికి చెందిన స్టాక్స్ రాణిస్తున్నాయి. దీంతో భారత్ నుంచి పెట్టుబడులు తరలిపోతున్నా యన్న ఆందోళనలూ మరో కారణంగా భావిస్తున్నారు.

# దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

విజయవాడ, తెలుగు రాష్ట్రాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. ప్రధాన ఆలయాల్లో శరన్నవరాత్రి వేడుకలు సాగుతున్నాయి. ఈ నెల 3 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాల్లో అమ్మవారు రోజుకో రూపంలో దర్శనం ఇవ్వనున్నారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో దేవీనవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏపీలోని పలు అమ్మవారి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాల సందడి నెలకొంది. తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో ఇప్పటికే శరన్నవరాత్రి ఉత్సవాలు మొదలయ్యాయి. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. వివిధ నైవేద్యాలను సమర్పించారు. భక్తులు కూడా తెల్లవారుజాము నుంచే ఆలయాలకు క్యూ కట్టారు. ఉత్సవాల్లో భాగంగా రోజుకొక రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాలలో భక్తులకు దర్శనమిస్తుంటారు అమ్మవారు. నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవగా.. చివరి రోజు దుర్గాష్టమితో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియనున్నాయి. ఈరోజు ఒక్కో ఆలయంలో ఒక్కో రూపంలో ఆ దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. తొలిరోజు విజయవాడలో శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు దర్శనమిస్తున్నారు. ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారికి స్నాపనాభిషేకం అనంతరం 9 గంటలకు దర్శన భాగ్యం కల్పించారు. తొలిరోజు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారిని చూసేందుకు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే వినాయకుని గుడి వద్ద నుంచి క్యూ లైన్‌లో భక్తులు వేచి ఉన్నారు. శ్రీశైలం శ్రీ భ్రమరాంభికా మల్లికార్జున స్వామి దేవాలయంలో దసరా దేవిశరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా మొదలయ్యాయి. శ్రీస్వామి, అమ్మవారి యాగశాల ప్రవేశంతో ప్రత్యేక పూజలు చేసి దసరా ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు అర్చకులు. దసరా మహోత్సవాలను ఆలయ అర్చకులు, ఈవో పెద్దిరాజు దంపతులు ప్రారంభించారు. ఈరోజు సాయంత్రం శైలపుత్రిగా భ్రమరాంబికాదేవి భక్తులకు దర్శనమివనున్నారు. బృంగివాహనంపై కన్నులపండువగా శ్రీస్వామి అమ్మవార్లు గ్రామోత్సవం జరుగనుంది. ఏలూరు జిల్లాలో ఈరోజు నుంచి ఈ నెల 12 వరకు ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ ఆలయంలో దసరా శర్నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. ఉత్సవాలలో రోజుకోక అలంకరణలో భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కలుగనుంది. ఈరోజు శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు కుంకుళ్లమ్మ దర్శనమిస్తున్నారు. ఆ దేవదేవి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో బారులు

# సీఎం రేవంత్ ప్రోగ్రాంలో ప్రముఖంగా కొండా సురేఖ..



హైదరాబాద్,సానుభూతి పొంగి పొర్లే అవకాశం ఉన్న వేళలో.. దాన్ని ఇబ్బడిముబ్బడిగా పెంచుకునే వ్యూహానికి విరుద్ధంగా ఎక్కడ లేని విమర్శలకు తావిచ్చేలా చేసుకునే నేతలు చాలా అరుదుగా ఉంటారు. ఆ కోవలోకే వస్తారు తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ. కోపం వచ్చినా.. ప్రేమ వచ్చినా ఆమెను ఆపటం సాధ్యం కాదు. తనను ఉద్దేశించి ఇష్టారాజ్యంగా.. నోటికి వచ్చినట్లుగా మాట్లాడే వారిని వదిలిపెట్టకూడదన్న కోపంతో కూడిన కసి. .ఆమె మాటల్లో బ్యాలెన్సును తప్పేలా చేశాయి. దీనికి తోడు.. ఆ మాటల వెనుక.. సోషల్ మీడియా ట్రోలింగ్ వెనుక మాజీ మంత్రి కేటీఆర్ ఉన్నారని బలంగా నమ్మటం మరో సమస్య.మొత్తంగా ఆమె తన నోటికి పని చెప్పారు. తన మాటల దాడి కేటీఆర్ వరకు పరిమితం చేసినా పరిస్థితి మరోలా ఉండేది. అందుకు భిన్నంగా మధ్యలో సినీనటుడు నాగార్జున.. ఆయన కుమారుడు నాగచైతన్యనను.. సినీ నటి సమంతను తీసుకొచ్చారు. అవసరం లేని.. అసందర్భమైన విషయాన్ని సందర్భానికి అతికించే ప్రయత్నం చేశారు. అది కాస్తా బెడిసి కొట్టింది. దీనికి తోడు టైం కూడా ఆమెకు శత్రువైంది. కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వేళలో.. ఎవరెన్ని మాటలు మాట్లాడినా.. ఎంతటి వివాదాస్పద వ్యాఖ్యలు చేసినా వాటికి కాదనే దమ్ము.. ధైర్యం లేని పరిస్థితి. అందుకే.. ఆయన మాటలు నచ్చని వారు.. ఆయన కారణంగా మాటలు పడినోళ్లు సైతం మౌనంగా ఉండిపోయారు.కానీ.. రేవంత్ ప్రభుత్వంలో భిన్నమైన సీన్ ఉంది. తమది ప్రజాప్రభుత్వమని చెప్పటమే కాదు.. చేతల్లోనూ అదే విషయాన్ని చేసి చూపిస్తున్నారు. కేటీఆర్.. హరీశ్.. ఈటల లాంటి సీనియర్ నేతలు వరుస పెట్టి విరుచుకుపడుతున్నా.. మాటకు మాటే ఉంటుందే తప్పించి.. ప్రతీకార చర్యల మాట కనిపించని పరిస్థితి. మారిన తెలంగాణలో ఇలాంటి పరిస్థితుల్లో ఎవరూ హర్షించని రీతిలో కొండా సురేఖ నోటి నుంచి వచ్చిన మాటలు.. మంటలుగా మారటం పెద్ద విషయం కాదు.గతంలో మరే వివాదం తెర మీదకు వచ్చినా.. చిత్రప్రముఖులు ఎవరూ ఇంత కలిసికట్టుగా రియాక్టు అయ్యింది లేదు. అందుకు భిన్నంగా ఈసారి మాత్రం పెద్ద ఎత్తున రియాక్టు అయ్యారు. నాగ్ ఫ్యామిలీ అయితే ఏకంగా ప్రియాంక గాంధీకి కంప్లైంట్ చేసిన పరిస్థితి. దీంతో.. కొండా సురేఖకు మంత్రి కొలువు ఊడిపోతుందని.. ఆమె మాజీ అయ్యే రోజు దగ్గరకు వచ్చేసిందన్న వాదనల జోరు పెరిగింది. ఈ ఎపిసోడ్ మొత్తంలో ముఖ్యమంత్రి రేవంత్ అస్సలు రియాక్టు కాలేదు. కామ్ గా ఉండిపోయారు. అయితే.. కొండా సురేఖకు మంత్రి పదవి పోతుందన్న ప్రచారానికి ఆయన ఫుల్ స్టాప్ పెట్టేయాలని భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది.అందులో భాగంగా ఆదివారం సాయంత్రం శిల్పకళావేదికలో జరిగిన కార్యక్రమానికి ఆమె హాజరు కావటమే కాదు.. ప్రోగ్రాంలో హైలెట్ గా నిలిచేలా జాగ్రత్తలు తీసుకోవటం కనిపించింది. దీంతో.. కొండా సురేఖకు ఈసారికి క్షమాభిక్ష లభించినట్లుగా చెబుతున్నారు. ఎప్పుడూ లేని విధంగా చిత్ర పరిశ్రమలోని పలువురు ఒకే తాటి మీద ఉన్నప్పుడు.. తమ మంత్రి విషయంలో తాము కూడా అంతే ఐకమత్యాన్ని ప్రదర్శించాల్సిన అవసరం ఉందన్న భావనకు ముఖ్యమంత్రి రేవంత్ వచ్చారా? అన్నదిప్పుడు చర్చగా మారింది.

# అధికారంలోకొచ్చినా తెలుగు తమ్ముళ్లలో తీవ్ర అసంతృప్తి...!

విజయవాడ:అధికారం దక్కింది.. హమ్మయ్య! అనుకున్నారు. ఇక, తమ్ముళ్లంతా హ్యాపీనేనని చంద్రబాబు కూడా భావిం చారు. మరీ ముఖ్యంగా నారా లోకేష్ వర్గం చాలా హ్యాపీగా ఉందని, ఉంటుందని కూడా భావించారు. ఇది సహజమే. అసలు అధికారంలోకి వస్తామా? అని రెండేళ్ల కిందట అనుకున్నతమ్ముళ్లకు కూటమి ఏర్పడ డం.. పవన్ సహకారం.. కేంద్రం నుంచి దన్ను రావడంతో గెలిచి నిలిచారు. అప్రతిహత విజయాన్ని అందుకున్నారు. ఇది ఎవరూ ఊహించని విజయం.దీంతో అందరూ ఖుషీగా ఉన్నారని చంద్రబాబు భావించడం కూడా తప్పుకాదు. కానీ, క్షేత్రస్థాయిలో పరి స్థితి అలా లేదు. తమ్ముళ్లు ఇంకా రగులుతున్నారు. ఎన్నికలకు ముందు పార్టీ కోసం పనిచేసినవారు.. ఇప్పటికీ.. అసంతృప్తితోనే ఉన్నారు. ప్రభుత్వం ఏర్పడింది కదా! ఇంకేంటి? అనుకుంటే.. ఇక్కడే అసలు సమస్య ఉంది. అదే..ప్రతీకార రాజకీయం%-% ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ నిజం. నేరుగా ప్రజాదర్బార్‌లోనే తమ్ముళ్లు ఈ ప్రతీకార రాజకీయాలపై ఫిర్యాదులు చేస్తున్నారు.నారా లోకేష్ నుంచి ఇతర మంత్రుల వరకు, పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నుంచి సీఎం చంద్రబా బు వరకు అనేక మందికి అందుతున్న ఫిర్యాదుల్లో కేడర్ ఈ విషయంపైనే ఎక్కువగా ఫోకస్ చేస్తోంది. మనం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు.. వైసీపీ నాయకులు అనేక రూపాల్లో వేధించారు. ఇప్పుడు వారిపై చర్యలు తీసుకుంటారా లేదా? అని నిలదీస్తున్నారు. చిత్రం ఏంటంటే.. ఎమ్మెల్యేలు కూడా కేడర్‌ను సర్దిచెప్పలేక పోతున్నారు. తర్వాత చూద్దాం లే! అని ఎవరైనా అంటే.. వెంటనే కేడర్ వారిపై మండిపడుతున్నారు.మీరు మీరు ఒక్కటే మధ్య బలయ్యేది మా పిల్లలే అంటూ.. ఇప్పటికీ వైసీపీ పెట్టిన కేసుల్లో చిక్కుకుని జైళ్లలో ఉన్న పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇక, కేడర్ కూడా.. తమపై దాడులు చేసిన వారు తమ కళ్ల ముందే తిరుగుతున్నారని.. వారిని వదిలేస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. అయితే... వాస్తవానికి వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని ఉన్నా.. అది సాధ్యపడదని, ఇలా చేస్తే.. వైసీపీకి టీడీపీకి తేడా ఏం ఉంటుందని అధిష్టానం చెబుతోంది. కాబట్టి సంయమనం పాటించాలని సూచిస్తోంది. అయితే.. కేడర్ మాత్రం ఎక్కడా వినిపించుకోవడం లేదు. ఈ పరిణామాలతో కేడర్ అసంతృప్తి మాత్రం తగ్గడం లేదు.

# లిక్కర్ బిజినెస్‌కు సాఫ్ట్‌వేర్లు రెడీ !

హైదరాబాద్,ఏపీలో మద్యం దుకాణాలను ప్రైవేటుగా ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో వాటిని దక్కించుకోవడానికి పెద్ద ఎత్తున పోటీ నెలకొంది. ఇప్పటి దాకాఈ రంగంలో అనుభవం లేనివారు కూడా దరఖాస్తులు చేస్తున్నారు. అలాంటి వారిలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు, డాక్టర్లు, ఆడిటర్లు, కాంట్రాక్టర్లు కూడా ఉన్నారు. స్వయంగా ఆఫీసులకు వచ్చి దరఖాస్తు చేసే విషయమై సందేహాలు నివృత్తి చేసుకుంటున్నారని అధికారులు చెబుతున్నారు



**దుకాణాల కోసం దరఖాస్తుల ప్రక్రియ**

ఒక్కో మద్యం షాపుకు ప్రస్తుతం దాఖలు అవుతున్న దరఖాస్తులను పరిశీలిస్తే అంచనాలు మించి వస్తాయని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా గుంటూరు, మంగళగిరి–తాడేపల్లి, పొన్నూరు తదితర నగరాల్లో సగటున ఒక్కో షాపునకు 10కి పైగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో ఎవరైతే మద్యం దుకాణాలు, రెస్టారెంట్లు నడిపారో వారే దరఖాస్తులు చేసుకుంటారని ఎక్సైజ్? అధికారులు భావించారు. అయితే.. ప్రస్తుతం వస్తున్న దరఖాస్తులను చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు.

**పోటెత్తుతున్న దరఖాస్తులు**

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎక్సైజ్ యంత్రాంగం సాధ్యమైనంత ఎక్కువ మందితో దరఖాస్తులు చేయించేలా అవగాహన కల్పించారు. దరఖాస్తు రుసుము ద్వారా ప్రభుత్వానికి పెద్దఎత్తున ఆదాయం తెచ్చిపెట్టాలని అధికారులు యోచిస్తున్నారు. అయితే.. గతంలో వైసీపీ ప్రభుత్వం నిర్దేశించిన బ్రాండ్లు మాత్రమే షాపుల్లో ఉండేవి.దీంతో పక్క రాష్ట్రాల నుంచి మద్యం పెద్ద ఎత్తున దిగుమతి అయ్యేది. కానీ, కూటమి ప్రభుత్వం నూతన పాలసీలో భాగంగా అన్ని రకాల బ్రాండ్లు, తక్కువ ధరలకే లభ్యమయ్యేలా అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించింది. అంతేకాకుండా ఎవరైనా వచ్చి లాటరీలో షాపు దక్కించుకునేలా పారదర్శకతను తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.ఈ సారి దరఖాస్తు రుసుము 2 లక్షల రూపాయలు పెట్టి దాన్ని నాన్ రిఫండబుల్ అమౌంట్?గా పేర్కొంది. దీంతో ఎవరైతే సీరియస్‌గా వ్యాపారం చేయాలని అనుకుంటున్నారో వారు మాత్రమే పోటీపడతారని ప్రభుత్వం భావించింది. దీంతో వ్యాపార నిర్వహణ సామర్థ్యం ఉన్న వ్యక్తులు వస్తారని అంచనా వేసింది.

**ఆరు వాయిదాల్లో చెల్లింపులు..**

గతంలో మద్యం దుకాణాల దరఖాస్తు చేసుకోవడానికి రుసుము ?10 వేలు మాత్రమే ఉండేది. దీంతో ఎవరు పడితే వాళ్లు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేవారు. తీరా షాపు దక్కించుకున్నాక నిర్దేశిత లైసెన్సుకు కట్టాల్సిన ఫీజులు కట్టకుండా మొహం చాటేసేవారు. తిరిగి వాటికి దరఖాస్తులు స్వీకరించాల్సి పరిస్థితి వచ్చేది.అయితే.. ఇప్పుడు పాలసీలో మాత్రం పట్టణ, రూరల్ ప్రాంతాల్లో వసూలు చేసే లైసెన్సు ఫీజు కూడా వేర్వేరుగా నిర్ధారించటంతో పాటు ఏ మండలంలో ఎన్ని షాపులకు పర్మిషన్లు ఇచ్చేది కూడా ముందుగానే ఎక్సైజ్ యంత్రాంగం? వెల్లడించింది. దీంతో దరఖాస్తు చేసుకొనే వారికి ఒక అవగాహన ఏర్పడింది. ప్రభుత్వం నిర్ణయించిన లైసెన్సు ఫీజు చెల్లించటానికి గతంలో మూడు వాయిదాలే ఉండేవి. ప్రస్తుతం దాన్ని ఆరు వాయిదాలకు కూటమి ప్రభుత్వం పెంచింది.

# తమిళనాట ఏపీ ఫార్మ్యులా.. పవన్ పొలిటికల్ స్కెచ్!?





విజయవాడ:పవన్ కల్యాణ్.. దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఈ పేరు మారుమోగుతోంది. తిరుపతి లడ్డూ కల్తీ వివాదం విషయంలో జనసేన అధినేత పవన్ చేసిన వ్యాఖ్యలు సరికొత్త చర్చకు దారితీశాయి. ఏపీలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కళ్యాణ్ కొనసాగుతున్నారు. అయితే, ప్రస్తుతం ఆయన ఉన్నట్లుండి తమిళనాడు రాజకీయాలపై దృష్టిసారించినట్లు కనిపిస్తోంది. పవన్ వ్యూహం వెనుక బిగ్ స్కెచ్ ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. వచ్చే ఏడాది చివరిలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఆ ఎన్నికల నాటికి తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేలా పవన్ ఇప్పటి నుంచి కసరత్తు మొదలు పెట్టినట్లు ప్రచారం జరుగుతుంది. ఇంతకీ.. పవన్ తమిళనాడు రాజకీయాల్లో ఎలాంటి పాత్ర పోషించబోతున్నారు.. ఏపీలో ఫార్ములాను తమిళనాట ప్రయోగించబోతున్నారా.. పవన్ తమిళ రాజకీయం అక్కడి సినీ ఇండస్ట్రీపై ఎలాంటి ప్రభావం చూపబోతుందో అన్నన చర్చ మొదలైంది.ఏపీలో గత ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి పోటీచేశాయి. ఈ క్రమంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ సారథ్యంలోని జనసేన పార్టీ వందశాతం స్ట్రైక్ రేట్ తో విజయం సాధించింది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పవన్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఏపీలో వైసీపీ దారుణ ఓటమికి చంద్రబాబుతోపాటు పవన్ కల్యాణ్ దికూడా కీలక భూమిక. చంద్రబాబు వ్యూహం, పవన్ దూకుడుతో వైసీపీ కేవలం పదకొండు స్థానాలకే పరిమితం అయింది. ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి జగన్ ఐదేళ్ల పాలనలో అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఈ క్రమంలోనే జగన్ హయాంలో తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించినట్లు లాబ్ రిపోర్టులు వచ్చాయి. తిరుపతి వేంకటేశ్వర స్వామి అంటే దేశవ్యాప్తంగానే కాక.. ప్రపంచ వ్యాప్తంగా హిందువులు భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. అలాంటి తిరుమలలో జగన్ హయాంలో కల్తీ నెయ్యి వాడారనే విషయం పెద్ద దుమారాన్నే రేపింది. అపచారం జరిగినందుకు క్షమించమని కోరుతూ పవన్ పదకొండు రోజుల పాటు ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. తిరుమల కొండపై దీక్షను విరమించి తిరుపతిలో వారాహి సభ నిర్వహించారు. ఈ సభలో వారాహి డిక్లరేషన్ చేస్తూ సనాతన ధర్మం గురించి పవన్ మాట్లాడారు. ఇదే క్రమంలో తమిళనాడు డిప్యూటీ సీఎంగా ఉన్న ఉదయనిధి స్టాలిన్ గతంలో సనాతన ధర్మం గురించి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. సనాతన ధర్మం జోలికి వస్తే ఊరుకునేది లేదని సీరియస్‌గానే పవన్ వార్నింగ్ ఇచ్చారు. వారాహి సభలో పవన్ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా చర్చ జరిగింది.. తమిళనాడులో అయితే పవన్ వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దుమారాన్నే రేపాయి. పవన్ వ్యాఖ్యలపై ఉదయనిధి స్టాలిన్ స్పందించకపోయినా.. డీఎంకే పార్టీ, ఆ పార్టీ మద్దతుదారులు సోషల్ మీడియా వేదికగా రియాక్టయ్యారు. పవన్ కళ్యాణ్‌కు కౌంటర్లు ఇస్తున్నారు. దీనికి తోడు పవన్ కల్యాణ్ పై తమిళనాడులో కేసు కూడా నమోదైంది. ఇదంతా ఒకెత్తయితే.. తమిళనాడు గురించి పవన్ మాట్లాడిన ప్రతి మాట వెనుక వ్యూహాత్మక ఎత్తుగడ ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. తమిళనాట మరో ఏడాదిన్నరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను టార్గెట్ గా చేసుకొని పవన్ ఇప్పటి నుంచే తన వ్యూహాన్ని అమలు చేస్తున్నారని, ఆయన వెనుక బీజేపీ పెద్దలు ఉన్నారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి. తమిళనాడులో పట్టు సాధించాలని బీజేపీ ఎప్పటినుంచో ప్రయత్నాలు చేస్తున్నది. కానీ, సాధ్యం కావటం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తుతో ఎన్నికలకు వెళ్లినా పెద్దగా ఫలితం దక్కలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విడిగా పోటీ చేసింది. కనీసం ఒక్కసీటును కూడా దక్కించుకోలేక పోయింది. దీనికితోడు కాంగ్రెస్, డీకేఎం కూటమి 39 పార్లమెంట్ నియోజకవర్గాల్లో విజయం సాధించి క్లీన్ స్వీప్ చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో తమిళనాడులో బీజేపీ అన్నామలైను హైలెట్ చేసింది. అన్నామలైకు రాష్ట్ర వ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ వచ్చినప్పటికీ అది ఓటుగా మారలేదు. దీంతో బీజేపీ ఈసారి పవన్ కల్యాణ్ ను తమిళనాడులో ప్రయోగించాలని భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. పవన్ కల్యాణ్ తమిళనాడు రాజకీయాల్లో హిందుత్వం పేరుతో ఎంట్రీ ఇస్తే.. అక్కడి సినీ పరిశ్రమ మద్దతు కూడా లభిస్తుందని బీజేపీ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. దీంతో పవన్ సైతం తమిళ రాజకీయాలపై దృష్టి కేంద్రీకరించారు. హిందుత్వం పేరుతో తమిళనాడులోని హిందువులను ఏకతాటిపైకి తీసుకురావడంతో పాటు.. ఏపీలో ప్రయోగించిన ఫార్ములాను తమిళనాడులో ప్రయోగించాలని పవన్, బీజేపీ పెద్దలు భావిస్తున్నారట. ఏపీలో ఎన్నికల ముందు బీజేపీ, టీడీపీని ఒకేతాటిపైకి తీసుకురావడంలో పవన్ పాత్ర కీలకమైంది. అదే సమయంలో తమిళనాడులో డీఎంకేకు గట్టి పోటీదారుగా ఉన్న అన్నాడీఎంకే, ఇతర పార్టీలను బీజేపీ పక్కకు తీసుకొచ్చేలా పవన్ పావులు కదుపుతున్నారు. సినీ హీరో విజయ్ కొత్త పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని ఇప్పటికే విజయ్ చెప్పారు. విజయ్ కు తమిళనాట మంచి క్రేజ్ ఉంది. డీఎంకే పార్టీ, విజయ్ పార్టీ మినహా మిగిలిన అన్ని పార్టీలను ఎన్డీయే కూటమిలోకి తీసుకొచ్చేలా పవన్ ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలో డీఎంకే పార్టీకి బద్ధశత్రువైన.. అన్నాడీఎంకే పార్టీ గురించి పవన్ వరుస ట్వీట్లు చేయడం ఇంట్రెస్టింగ్‌గా మారింది. అన్నాడీఎంకే పార్టీ ఏర్పాటై 53 ఏళ్లు కావొస్తున్న నేపథ్యంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎంజీఆర్ గురించి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆసక్తికర ట్వీట్ చేశారు. అలాగే అన్నాడీఎంకే పార్టీ శ్రేణులకు, మద్దతుదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంజీఆర్ పై ప్రశంసల వర్షం కురిపించారు. మరోవైపు డీఎంకే, విజయ్ పార్టీలు ఎక్కువగా క్రిస్టియన్, ముస్లీం ఓట్లపై దృష్టిసారించాయి. దీంతో ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో హిందుత్వ ఓట్లను టార్గెట్ చేయడమే బీజేపీ లక్ష్యంగా చెబుతున్నారు. ఈ క్రమంలో అన్నామలైతో పాటు పవన్ కల్యాణ్ సేవలను కూడా బీజేపీ వినియోగించుకోబోతుంది. పవన్ ఇప్పటికే రంగంలోకి దిగడంతో తమిళనాట రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. మరి పవన్ టార్గెట్ రీచ్ అవుతారా.. పవన్ ద్వారా బీజేపీ అనుకున్న లక్ష్యానికి చేరుకుంటుందా అనేది వేచి చూడాల్సిందే.

# వైసీపీ గేటు ఒక్క సారి దాటితే...జగన్ స్ట్రాంగ్ డెసిషన్



అమరావతి,వైసీపీ అన్నది జగన్ కలల సౌధం. ఆయన ఆ పార్టీకి అధినేత. నేను మీ అందరికీ ప్రతినిధిని అని జగన్ తాజాగా పార్టీ నేతలతో అనవచ్చు కానీ జగన్ రెక్కల కష్టం వైసీపీ. జగన్ ఆశల రూపం వైసీపీ. జగన్ నిర్ణయమే అక్కడ ఫైనల్.వైసీపీ బాగుండాలనే జగన్ ఆలోచిస్తారు. అదే సమయంలో ఎవరైనా సలహాలు ఇస్తే ఆయన స్వీకరించవచ్చు లేదా పక్కన పెట్టవచ్చు. ఇక వైసీపీలో ఉన్న వారు జగన్ ఆలోచనల మేరకు పనిచేయాలి. పార్టీ అంటే అలాగే ఉండాలి, ఒకే మాట మీద క్రమశిక్షణతో అన్నది జగన్ ఆలోచన.జగన్ పార్టీ వయసు 13 ఏళ్ళు. మరో నాలుగు నెలలలో 14 ఏళ్ల పార్టీ అవుతుంది. అయితే ఈ తక్కువ టైం లో ఎన్నో ఆటుపోట్లను వైసీపీ చూసింది. జగన్ మూడున్నర పదుల వయసులోనే అతి పెద్ద రాజకీయ సవాల్ ఎదుర్కొన్నారు. దాంతో జగన్ కి కష్టాలు అలవాటు అయిపోయాయి. సవాళ్ళు కూడా ఆయన ఏవి వచ్చినా లెక్కచేయరు.అయితే పార్టీ విపక్షంలో ఉండగా చేరడం వేరు. విపక్షం నుంచి అధికారంలోకి వచ్చి మళ్లీ విపక్షంలోకి వచ్చాక కొనసాగడం వేరు. ఈ తత్వం సరిపడని వారు పార్టీ గేటుని దాటి బయటకు వెళ్ళిపోయారు. అందులో జగన్ సొంత బంధువు అయిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఉన్నారు.అదే విధంగా వైఎస్సార్ ఫ్యామిలీకి విధేయంగా ఉన్న మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ళ నాని, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, కిలారి రోశయ్య, ఉదయభాను వంటి వారు ఉన్నారు. అయితే ఇలా వెళ్ళిన వారి విషయంలో వైసీపీ ఏమీ పిలిచి బతిమాలింది లేదు. పార్టీ ఓటమి పాలు అయింది. అయిదేళ్ల పాటు ఎన్నో సవాళ్ళు ఉంటాయి. వాటికి తట్టుకుని ఉండేవారు ఉంటారు అన్నదే వైసీపీ అధినాయకత్వం ఆలోచన.పైగా ప్రజల నుంచే నేతలు వస్తారు అన్నది కూడా వైసీపీ మాట. అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎన్ని చేసినా వ్యతిరేకత కచ్చితంగా వస్తుందని ఆ వ్యతిరేకత ప్రతిపక్షానికి సొమ్ము అవుతుందని అపుడు జనాల నుంచే నాయకులు వచ్చి జెండా ఎత్తుతారని కూడా వైసీపీ నమ్మకంగా ఉంది.ఇక పార్టీలో ఉన్న నేతలతోనే బండిని నడిపించాలని కూడా డిసైడ్ అయింది. అదే సమయంలో వైసీపీ ఎన్నడూ లేనంతగా కేవలం 11 సీట్లకే పరిమితం అయి దారుణంగా ఉన్న వేళ ఈ కష్టకాలంలో పార్టీని విడిచి వెళ్ళిన వారి పట్ల వైసీపీ అధినాయకత్వం అయితే సీరియస్ గానే ఉంది అని అంటున్నారు.ఇలా వెళ్ళిన వారు కూటమి అధికారంలో ఉంది కదా అని తమకు అవకాశాలు ఉంటాయని భావించి ఉంటారని అనుకుంటోంది. ఒకవేళ అక్కడ అవకాశాలు దక్కకపోతే మాత్రం వారు కచ్చితంగా మళ్లీ వెనక్కే వస్తారు అని కూడా భావిస్తోంది.అయితే అలా వెనక్కి వచ్చినా వారిని తిరిగి తీసుకునే ప్రసక్తే లేదని వైసీపీ హై కమాండ్ గట్టి నిర్ణయంతో ఉంది అని అంటున్నారు. పార్టీకి నేతలు కావాలి కానీ కష్ట కాలంలో వదిలేసి మళ్లీ తమకు అవసరం అనుకునపుడు వచ్చే వారు అసలు వద్దు అన్నది వైసీపీ ఆలోచనగా చెబుతున్నారు.చాలా చోట్ల కొత్త నాయకత్వానికే చాన్స్ ఇవ్వాలి తప్ప మళ్లీ పార్టీని వీడి వచ్చి తలుపు తడితే మాత్రం గేటు తెరచుకోదు అని చెబుతున్నారు. ఇది వైసీపీ హై కమాండ్ పార్టీలో ఉన్న నాయకులకు చెబుతోందిట. బాగా ఆలోచించుకుని వైసీపీలోనే కొనసాగితే మంచి అవకాశాలు ఇస్తామని చెబుతోంది.అలా కాకుండా తమకు నచ్చినపుడు బయటకు వెళ్ళి అవసరం అయినపుడు వెనక్కి తిరిగి వస్తామనుకుంటే కనుక వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ చేరదీసేదే లేదు అని కూడా చెబుతోంది. మొత్తానికి చూస్తే వైసీపీ కఠిన నిర్ణయమే జంపింగ్ జపాంగుల పట్ల తీసుకుంది అని అంటున్నారు.వీరి సంగతి సరే కానీ టీడీపీ జనసేన నుంచి వచ్చే నేతలను తీసుకుంటారా అన్న చర్చ నడుస్తోంది. వారిని తీసుకుంటారని ఆయా చోట్ల తమకు బలం తగినంత కావాల్సిందే మాత్రం ఇతర రాజకీయ పార్టీలు చేసిన తీరుగానే చేస్తారు అని అంటున్నారు. సో వైసీపీని వీడిన మాజీలకు ఇక గేట్లు మూసినట్లే అని అంటున్నారు.

# రైల్వే అధికారుల నియామకాలపై కేంద్రం యూటర్న్

న్యూఢిల్లీ : రైల్వే అధికారుల నియామక విధానంపై కేంద్రం యూటర్న్ తీసుకుంది. రైల్వే ఉద్యోగాలలో నియామకాలకు సంబంధించి సుమారు ఐదు సంవత్సరాల క్రితం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఎనిమిది రైల్వే సర్వీసులను ఒకే సివిల్ సర్వీస్‌గా విలీనం చేస్తూ ఐదు సంవత్సరాల క్రితం కేంద్రం నిర్ణయం తీసుకుంది. అయితే 2019లో తీసుకున్న క్యాబినెట్ నిర్ణయానికి విరుద్ధంగా రైల్వే సర్వీసులలో నియామకాలను రెండు వేర్వేరు పరీక్షల ద్వారా చేపట్టాలని తాజాగా నిర్ణయించింది. సాంకేతికేతర సర్వీసులకు సివిల్ సర్వీసెస్ పరీక్షలు (సీఎస్ఈ), సాంకేతిక సర్వీసులకు ఇంజినీరింగ్ సర్వీస్ పరీక్షలు (ఈఎస్ఈ) నిర్వహిస్తారు. ఈ పరీక్షలను యూపీఎస్సీ చేపడుతుంది. ఈ మేరకు రైల్వే మంత్రిత్వ శాఖ శనివారం టెలికమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖకు ఓ లేఖ రాసింది. దానిపై 'ఎలాంటి జాప్యం లేకుండా' అని పేర్కొంది. ఈఎస్ఈకి టెలికమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ నోడల్ మంత్రిత్వ శాఖగా వ్యవహరిస్తుంది. రైల్వే శాఖలో సాంకేతిక, సాంకేతికేతర సిబ్బంది అవసరాలను పరిగణనలోకి తీసుకొని ఈ ప్రతిపాదనకు ఆమోదం




తెలుపుతున్నామని సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖ తన ఆఫీస్ మెమొరాండంలో తెలియజేసింది. సర్వీసుల విలీనం తర్వాత సాంకేతిక అధికారుల కొరత పెరిగిన నేపథ్యంలో విలీన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com